ఉండమ్మా.. బొట్టు పెడతా!

- ఆనవాయితీగా కొద్దేవర బొట్టు
- మొరుసుకాపు రెడ్ల సంప్రదాయ కార్యక్రమం
- శుభప్రదంగా భావిస్తున్న మహిళలు



కొద్దేవర బొట్టు కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

తంబళ్లపల్లె : నియోజకవర్గంలోని మొరుసుకాపు రెడ్ల కుటుంబంలో మహిళలు సంప్రదాయంగా కొద్దేవర బొట్టు కార్యక్రమం నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఐక్యత, ఆరోగ్యానికి ప్రతీకగా ఈ కొద్దేవర బొట్టు నిలుస్తుంది. మండలంలోని తూగువారిపల్లెలో ఆదివారం మొరుసుకాపు రెడ్ల మహిళలు కొద్దేవర బొట్టు కార్యక్రమాన్ని నియమనిష్టలతో ఘనంగా జరుపుకున్నారు. దేవర పెద్ద వీరభద్రారెడ్డి, కొర్రలు, పచ్చివరి, బెల్లం, పసుపును మిశ్రమం చేసి కొద్దేవర బొట్టు తయారుచేస్తారు. ఇందులో కొర్ర, పచ్చివరిలో విటమిన్లు, బెల్లంలో ఐరన్ ధాతువులు ఉండటం వలన ఆరోగ్యం చేకూరుతుంది. ఈ కార్యక్రమానికి సుదూరప్రాంతాల్లో ఉన్న వారు కూడా హాజరుకావడం విశేషం. పెళ్లి అయిన మహిళలకు, వృద్ధులకు, వితంతువులకు ఈ కొద్దేవర బొట్టు పంపిణీ చేయడం ఆనవాయితీ. ప్రతి ఏడాది రెండుసార్లు ఈ కొద్దేవర బొట్టు కార్యక్రమాన్ని నిర్వహించుకుంటారు. మహిళలు ఉపవాసంతో కులదైవం వీరభద్రస్వామి ఆలయం (దేవరిల్లు) వద్ద భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తారు. అనంతరం దేవరపెద్ద పంపిణీ చేసిన ఈ బొట్టును నుదుట ధరించి మిశ్రమాన్ని ఆరగిస్తారు.

తరాలుగా కొనసాగుతున్న ఆచారం

నుదుట బొట్టు పెట్టించుకోవడమే కొద్దేవర బొట్టుగా వ్యవహరిస్తారు. పెళ్లయిన మహిళలు దీన్ని చేయడం వలన శుభప్రదంగా ఉంటుందన్న భావన కొనసాగుతోంది. ఈ సంప్రదాయాన్నితరతరాలుగా క్రమం తప్పకుండా ఆచరిస్తూ వస్తున్నారు. పూర్వీకుల నుంచి ఇది ఒక ఆచారంగా స్థిరపడిపోయింది. పెద్దల ఆచారాన్ని నేటి తరం మహిళలకు కూడా పాటిస్తూ వస్తున్నారు. మహిళలు బొట్టుపెట్టుకోవడం సాధారణమే అయినా ఈ కొద్దేవర బొట్టు విశిష్టమైనదే కాదు, ప్రత్యేకమైనది కూడా. దీన్ని శుభప్రదంగా భావిస్తారు.



కొద్దేవర బొట్టు ప్రసాదం

క్రమశిక్షణతో నిర్వహిస్తాం



మా పూర్వీకుల నుంచి వంశపారంపర్యంగా దేవరపెద్దగా కొనసాగుతున్నాం. మా దాయాదులందరూ మా కుటుంబానికి ఎంతో గౌరవం ఇస్తారు. క్రమశిక్షణతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం.

– వీరభద్రారెడ్డి, దేవరపెద్ద, తూగువారిపల్లె

నియమనిష్టలతో వస్తాం



ఈ కార్యక్రమానికి మహిళలందరూ ఉపవాసంతో నియమనిష్టలతో దేవరింటి వద్దకు హాజరవుతాం. 60 ఏళ్లుగా ఈ కొద్దేవర బొట్టు కార్యక్రమంలో పాల్గొంటున్నా. ఎంతో మంచి కార్యక్రమం.

– సుబ్బమ్మ, వృద్ధురాలు, తూగువారిపల్లె

ఆనందంగా ఉంది



నాకు కొత్తగా వివాహం అయింది. అత్తవారింటి తరఫున మొదటిసారిగా కొద్దేవరబొట్టు కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంతో పాటు ఆశ్చర్యం కూడా కలుగుతోంది. ఉద్యోగరీత్యా సుదూరప్రాంతాల్లో ఉన్న వారు సైతం ఈ కార్యక్రమానికి హాజరయ్యాం. దేవరపెద్ద తెలిపిన నియమాలతో ఈ కార్యక్రమాన్ని జరుపుకోవడం సంప్రదాయంగా వస్తోంది.

– రెడ్డిరాణి, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, బెంగళూరు

క్లుప్తంగా

నేడు శివ, పార్వతుల కల్యాణోత్సవం

పెద్దతిప్పసముద్రం: కార్తీక మాసోత్సవాల్లో భాగంగా సోమవారం శివ, పార్వతుల కల్యాణోత్సవం, కార్తీక దీపోత్సవం కార్యక్రమాలు వైభవంగా నిర్వహిస్తామని శివాలయం సేవకులు సనగరం పట్టాభి రామయ్య తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

రైతులకు రుణాలు మంజూరు



మాట్లాడుతున్న శ్యాం ప్రకాష్‌రెడ్డి

పెద్దతిప్పసముద్రం: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం బ్యాంక్ (సొసైటీ) ద్వారా మండలంలోని రైతులకు బంగారం, వ్యవసాయ పంటలపై రుణాలు మంజూరు చేస్తున్నామని బ్యాంక్ ఇన్‌చార్జి శ్యాం ప్రకాష్‌రెడ్డి తెలిపారు. 71వ అఖిల భారత వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక సొసైటీ బ్యాంక్ ఎదుట జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్యాంకు సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, త్వరలోనే బ్యాంకు ద్వారా జన ఔషధి (జనరిక్) కేంద్రం ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఈ వారోత్సవాల్లో బ్యాంకు సీఈఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అధికారుల నియామకం

సాక్షి ఎఫెక్ట్..

పెద్దతిప్పసముద్రం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బంది కొరత వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో ఇటీవల సాక్షి పత్రికలో ‘ఎంపీడీఓ కార్యాలయంలో సిబ్బంది కొరత’ అని వెలువడిన వార్తపై జిల్లా అధికారులు స్పందించారు. టైపిస్ట్ మినహా కీలకమైన అడ్మినిస్ట్రేటివ్ అధికారి (ఏఓ), సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్లను నియమించారు.

అయ్యప్ప మాలాధారులకు భిక్ష



అయ్యప్పమాలాధారులకు భిక్ష పెడుతున్న హెల్పింగ్ మైండ్స్ సభ్యులు

మదనపల్లె సిటీ: నియమనిష్టలు, భక్తిశ్రద్ధలతో అయ్యప్పమాల వేసిన మాలాధారులకు హెల్పింగ్‌మైండ్స్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జ్ఞానోదయ పాఠశాలలో భిక్ష కార్యక్రమం నిర్వహించారు. మత సామరస్యం పాటిస్తూ ప్రతి ఏడాది అయ్యప్ప మాలాధారులకు భిక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మొదట అయ్యప్పస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. సభ్యుల సహకారంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపకులు అబూబకర్‌సిద్దిక్, సభ్యులు కిరణ్, అబిద్, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ ఎరీషావలీ

మదనపల్లె : వన్‌టౌన్ పరిధిలోని రౌడీషీటర్లకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ ఎరీషావలీ ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. రికార్డుల్లోని రౌడీషీటర్లను స్టేషన్‌కు పిలిపించి వారికి తగు సూచనలు చేశారు. అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొంటే తీవ్రమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో మెలగి కేసులకు దూరంగా ఉంటే రౌడీషీట్ తొలగించేందుకు మార్గం సుగమం అవుతుందని తెలిపారు. గొడవలకు దూరంగా ఉండాలని సూచించారు. రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచామని పేర్కొన్నారు.

మేస్త్రీపై దాడి

మదనపల్లె : మేస్త్రీపై కొందరు వ్యక్తులు దాడిచేసిన ఘటన ఆదివారం సాయంత్రం మదనపల్లెలో జరిగింది. బసినికొండలోని ఓవర్‌హెడ్ ట్యాంక్ వద్ద స్థానికుడైన భవననిర్మాణ కార్మిక మేస్త్రీ మురళీకృష్ణ వాటర్‌ట్యాంక్ నిర్మాణ పనులు చేస్తుండగా అదేప్రాంతానికి చెందిన ఆర్టీసీ శంకర, అతడి కుమారులు చిన్న, కన్నా, విక్రమ్, లోకేష్, ఆకుల కార్తీక్, మురళీ, కృష్ణ తదితరులు మద్యం మత్తులో అక్కడకు వచ్చి పనులు అడ్డుకునేందుకు ప్రయత్నిస్తూ మురళీకృష్ణను పనులు చేయించేందుకు నీవు ఎవరంటూ అడ్డుకున్నారు. అధికారుల ఆదేశాల మేరకే పనులు చేస్తున్నామని, అభ్యంతరం ఉంటే అధికారులకు తెలపాల్సిందిగా మురళీకృష్ణ సమాధానమిస్తున్నా, పట్టించుకోకుండా అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడి చేసి కొట్టారు. అడ్డుకోబోయిన అతడి భార్య గాయత్రి, కుమార్తె కీర్తిపై దాడిచేశారు. గాయపడిన మురళీకృష్ణను స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దాడి ఘటనపై బాధితుడు తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు.

గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం

కురబలకోట: అంగళ్లులో ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి (39) అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు ఎవరనేది తెలియడం లేదని ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

కరాటేలో సత్తా చాటిన విద్యార్థులు



ప్రతిభ సాధించిన కరాటే విద్యార్థులతో కోచ్‌లు

మదనపల్లె సిటీ: తమిళనాడు రాష్ట్రం ఊటీ అన్నా స్పోర్ట్స్ ఇండోర్ స్టేడియంలో జరిగిన రైజింగ్ గోజు కరాటే స్కూల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో మదనపల్లె యూత్ కరాటే విద్యార్థులు సత్తా చాటారు. చాంపియన్‌షిప్‌లో 13 సంవత్సరాల కటా విభాగంలో కాలేషా, మస్తాన్ ప్రథమస్థానం సాధించగా, 18 సంవత్సరాల కటా విభాగంలో మహబల్ రహిమాన్ ప్రథమస్థానం, 6 సంవత్సరాల కటా విభాగంలో డి.ఏ.హేమాష్ ప్రథమ స్థానం, 13 సంవత్సరాల కటా విభాగంలో చరణ్‌తేజ ప్రథమ స్థానం, 12 సంవత్సరాల కటా విభాగంలో మహమ్మద్‌హైమాన్ ద్వితీయ స్థానం, 10 సంవత్సరాల కటా విభాగంలో ధనుష్‌కుమార్‌రెడ్డి తృతీయ, 16 సంవత్సరాల కటా విభాగంలో జైత్రమాధుర్ తృతీయ స్థానం, 7 సంవత్సరాల కటా విభాగంలో అమీన్ అబ్దుల్లా తృతీయస్థానంలో నిలిచారని యూత్ కరాటే క్లబ్ వ్యవస్థాపకులు సురేష్ తెలిపారు.

రెడ్డెమ్మ కొండలో భక్తుల రద్దీ



శ్రీరెడ్డెమ్మతల్లి ఆలయంలో సంతానం కోసం వరపడిన మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ఉదయాన్నే పలు రకాల నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సంతాన ప్రసాదించే తల్లిగా ప్రసిద్ధి పొందిన అమ్మవారి ఆలయంలో ఉదయం నుంచే భక్తుల సందడి మొదలైంది. తడిబట్టలతోనే అమ్మవారి ముందు సంతానం కోసం వరపడ్డారు. సంతానం కలిగిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరసారెలతో మొక్కుబడులు చెల్లించుకొన్నారు. అమ్మవారికి భక్తి శ్రద్ధలతో తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకొన్నారు. భక్తులు ఆలయంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. హిందువులతో పాటు ముస్లిం కూడా అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆకట్టుకున్న కవి సమ్మేళనం



మదనపల్లె సిటీ: బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు



పీలేరు : లెమన్ స్పూన్ పోటీలో పాల్గొన్న విద్యార్థినులు

మదనపల్లె సిటీ: స్థానిక సీటీఎం రోడ్డులోని శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన కవి సమ్మేళనం ఆకట్టుకుంది. ప్రముఖ రచయిత టీ.ఎస్.ఎ.కృష్ణమూర్తి, సులోపక్యనం కథ చదివి వినిపించారు. కవులు హసీనాబేగం, వి.వి.ప్రసాద్, నాగరాజ, ప్రసాద్‌శర్మ, యుగంధరాచారి, కుమారస్వామి, వాసుదేవరావు, శ్రీనివాసులు, హేమలత, నాగభూషణం, రామ్మోహన్‌నాయుడు, గాయిత్రిదేవి కవితలు చదివి వినిపించారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి వసంతకుమారి, సీనియర్ సిటిజెన్స్ అధ్యక్షుడు ముని గోపాలకృష్ణ, సిబ్బంది శిరీష, జయమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

పీలేరు : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయాధికారి అమరనాథ్ తెలిపారు. ఆదివారం స్థానిక ఎంపీపీ, జెడ్పీ మెయిన్ పాఠశాలల విద్యార్థులు 49 మంది ఆటల పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటల పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు గ్రంథాలయ వారోత్సవాల ముగింపు రోజున బహుమతులు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరసింహులు, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి

బి.కొత్తకోట: లబ్ధిదారుల ప్రతి ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించాలని బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణప్ప ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండలంలోని మరవపల్లెలో ఇళ్లలేని పేదలతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంత పేదలకు మూడు సెంట్లు, పట్టణ పేదలకు రెండు సెంట్ల స్థలం ఇవ్వాలని కోరారు. ఇంటి నిర్మాణాలకు ఇసుక ఉచితంగా ఇవ్వాలని కోరారు. ఈ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ సోమవారం గ్రామ సచివాలయాల ఎదుట ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మనోహర్‌రెడ్డి, తంబయ్యశెట్టి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేసిన మానవత సంస్థ సభ్యులు

పీలేరురూరల్ : స్థానిక సదుం మార్గంలో పీలేరు పట్టణంలో ఆదివారం వృద్ధులకు, అనాథలకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ వి. రామచంద్ర మాట్లాడుతూ చలికి ఇబ్బంది పడుతున్న వారికి దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ పోతంశెటి రమేష్, రహత్‌బాషా, సుధాకర్‌బాబు, అక్రమ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

నాగదేవతల విగ్రహాల ప్రతిష్టాపన



నాగదేవతలకు పూజలు చేస్తున్న భక్తులు

కేవీపల్లె : మండలంలోని కేవీపల్లె గ్రామ సమీపంలో ఆంజనేయ స్వామి ఆలయంలో నాగదేవతల ప్రతిమలు ఏర్పాటు చేశారు. ఆదివారం గ్రామానికి చెందిన భక్తులు నాగప్రతిమలు ఏర్పాటు చేసి పూల మాలలతో అలంకరించి పూజలు నిర్వహించారు. అక్కడే ఉన్న పుట్టకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

వైభవంగా అంబలం పూజ

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో అంగరంగ వైభవంగా అంబలం పూజ నిర్వహించారు. అయ్యప్ప దీక్షలు చేపట్టిన భక్తులు శనివారం రాత్రి ఆలయంలో ప్రత్యేకంగా శివాలయం ఎదురుగా అయ్యప్ప స్వామి వారి ప్రతిమను ఉంచి పద్దెనిమిది మెట్లు ఏర్పాటు చేసి పూజలు చేశారు. అయ్యప్ప భక్తులకు అక్కడే భిక్ష ఏర్పాటు చేశారు. అనంతరం ఆలయ ఈఓ డివి రమణారెడ్డిని అయ్యప్ప భక్తులు సన్మానించారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



మాజీ ఎమ్మెల్యే రామచంద్రారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

కలికిరి/కలకడ: నియోజకవర్గంలోని కలకడ, కలికిరి, వాల్మీకిపురం మండలాల్లో పలు కార్యక్రమాలకు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హాజరయ్యారు. కలకడ మండలం కదిరాయచెరువుకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పోకల వెంకట్ యాదవ్ గృహప్రవేశం, కలికిరి అజయ్ ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్‌సీపీ కృష్ణారెడ్డి బంధువుల జన్మదినం, ఇందిరమ్మ కాలనీలో భాస్కర్‌రెడ్డి కుమార్తె వివాహ కార్యక్రమాలకు ఆయన హాజరయ్యారు. వాల్మీకిపురం మండలం శాఖంవారిపల్లిలో బీసీ నాయకుడు చలంకోటి నాగరాజ కుమారుడు వివాహ కార్యక్రమానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అలాగే వాల్మీకిపురం పట్టణంలో మాజీ సర్పంచ్ సురేంద్రరెడ్డి భార్య రమాదేవి ఉత్తర క్రియలకు హాజరై ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమాల్లో కలికిరి, వాల్మీకిపురం మండలాల వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు రమేష్‌కుమార్‌రెడ్డి, నీళ్ల భాస్కర్, నాయకులు వెంకటరెడ్డి, రత్నశేఖర్‌రెడ్డి, బిడ్డల కేశవరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మహేంద్రరెడ్డి, భోగేష్, డాక్టర్ ఏవీ రమణ, మదన్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాసవిక్లబ్ సేవలు విస్తృతం చేస్తాం



వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ వీ211ఎ సోమిశెట్టి లీలీసురేష్ సంబరాల్లో నాయకులు

పీలేరు : వాసవిక్లబ్ సేవలు మరింత విస్తృతం చేస్తామని వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ సెక్రటరీ హెచ్.ఎస్. నాగభూషణ, అబ్జర్వర్ శ్రీనివాసరావు తెలపారు. ఆదివారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ వీ211ఎ సోమిశెట్టి లీలీసురేష్ సంబరాలు (డిస్ట్రిక్ కాన్ఫరెన్స్) నిర్వహించారు. గవర్నర్ సోమిశెట్టి సురేష్‌బాబు ఆర్యవైశ్య కల్యాణ మండపానికి 100 కుర్చీలు వితరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాసవిక్లబ్ సీడ్‌బాల్స్ తయారు చేసి చెట్లను పెంచే కార్యక్రమంలో విజయాన్ని సాధించినందుకు వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ నుంచి 16 కుట్టుమిషన్లు అందజేసినట్లు తెలిపారు. 2024లో సేవా కార్యక్రమాలకు రూ. 36.87 లక్షలు వినియోగించినట్లు చెప్పారు. డిస్ట్రిక్ మొత్తం వాసవిక్లబ్ గ్రేటర్ పీలేరు, వాసవికపుల్స్ క్లబ్ 164 సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రథమ స్థానంలో ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవిక్లబ్ నాయకులు ముల్లంగి విజయకుమార్, నాగలక్ష్మీ, వెలవలూరి వెంకటేష్, రమ్య రమేష్, తేజ యశస్వి గుప్తా, పామిడి నాగరాజ, ఆనంద్, మహిధర్, పామిడి జయచంద్ర, నాగేంద్ర, బాలాజీ, అరవింద్ బాబు, నరేంద్ర, సకల రమేష్, గ్రంధి నరసింహులు, భరత్, ప్రభాకర్, తులసి, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

రామసముద్రం : రామసముద్రం మండలం చెంబకూరు గ్రామపంచాయతీలోని జిల్లా ఉన్నత పాఠశాలలో ఆదివారం 2006–07 విద్యాసంవత్సరంలో విద్యను అభ్యసించిన పూర్వవిద్యార్థులు ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విద్య నేర్పిన ఉపాధ్యాయులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకుని వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చదువుకున్న పాఠశాలకు తమవంతు సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బంది సమయం పాటించాలి



సమయపాలన వారోత్సవాల కార్యక్రమంలో డీఎం కుమార్

పీలేరు రూరల్ : ఆర్టీసీ సిబ్బంది సమయం పాటించి సంస్థకు ఖర్చు తగ్గించి ఆదాయం పెంచాలని డీఎం కుమార్ సూచించారు. సమయపాలన వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక ఆర్టీసీ గ్యారేజ్‌లో గేట్‌మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెకానిక్‌లు సకాలంలో విధులకు హాజరు కావాలన్నారు. బస్సుల కండీషన్లు ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. అలాగే డ్రైవర్లు, కండక్టర్లు సమయం పాటించడం, ప్రయాణీకులతో మర్యాదపూర్వకంగా మెలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్యారేజ్ ఎంఎఫ్ హరినాథరెడ్డి, మెకానిక్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్యం అందించడమే ధ్యేయం



మాట్లాడుతున్న మానవత వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి

లక్కిరెడ్డిపల్లి : గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించి మంచి ఆరోగ్యాన్ని అందించడమే మానవత ధ్యేయమని మానవత వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక నలందా ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మానవత సేవా కార్యక్రమాలలో భాగంగా నేడు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. రాయచోటికి చెందిన ధన్వి నారాయణ హాస్పిటల్ వైద్యులు గ్రామస్తులను పరీక్షించారు. మానవత కేంద్ర కమిటీ సభ్యులు ప్రసాద్ యాదవ్, డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి, భువనేశ్వరి, స్వాతి రెడ్డి, జానకీరామ్, హరిశ్రీ, ఎలుగోటి శ్రావణి, ప్రసాద్ బాబు, మానవత చైర్మన్ బాల సుబ్రమణ్యం, జిల్లా కన్వీనర్ శివయ్య, ప్రెసిడెంట్ షఫీనాయక్, సాయి చరణ్ పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ట, ఉత్సవాలు

వీరబల్లి : మండలంలోని పెద్దివీడు పంచాయతీలో కొత్తపల్లెలో నూతనంగా నిర్మించిన సీతారామ స్వామి గుడిలో విగ్రహ ప్రతిష్ట, ఉత్సవాలు సోమవారం (నేడు) ప్రారంభమవుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 20వ తేదీ జరిగే విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డిలు పాల్గొంటారని నిర్వాహకులు పేర్కొన్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తామన్నారు.

చినుకుపడితే.. ఇక అంతే..!

- రోడ్లపై పొంగిపొర్లుతున్న మురుగునీరు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



మదనపల్లె సిటీ: జలమయంగా మారిన బెంగళూరు బస్టాండు



బురదమయంగా కలకడ టమాటా మార్కెట్

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణంలో చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లు చెరువైపోతున్నాయి. రోడ్లపై మోకాళ్లలోతు నీళ్లు నిలుస్తున్నాయి. దీంతో ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. బెంగళూరు బస్టాండు, ఆర్టీసీ బస్టాండు, పీ అండ్ టీ కాలనీ, ప్రశాంత్‌నగర్, దొంతివీధి, ఇందిరానగర్, నిమ్మనపల్లె క్రాస్, కదిరి రోడ్డు, బీటీ కాలేజీ రోడ్డు ప్రాంతాల్లో రోడ్లపై వర్షం నీరు నిలిచిపోవడంతో చెరువులను తలపిస్తున్నాయి.

దెబ్బతిన్న డ్రైనేజీ కాలువలు

పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్థవ్యస్తంగా ఉంది. దీంతో కాలువలు పొంగిపొర్లుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. వర్షాలకు దోమల బెడద ఎక్కువగా ఉంది. కాలువలు మరమ్మతులు చేసి డ్రైనేజీ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చినుకు పడితే చిత్తడే

కలకడ : కలకడ టమాటా మార్కెట్‌లో చినుకు పడితే చిత్తడే అనే చందంగా కొద్దిపాటి వర్షానికే నీళ్లు నిలిచి బురదమయం అవుతుంది. దీంతో రైతులు, వ్యాపారులు, కూలీలకు ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్ ప్రాంగణంలో పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. వర్షాల సమయంలో గుంతల్లో నీరు నిలిచిపోవటంతో వాహనాలు వచ్చినపుడు ఆ గుంతల్లో మురుగు నీరు పాదచారులపై పడి అవస్థలు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మార్కెట్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలని రైతులు, కూలీలు కోరుతున్నారు.